# భూ సేకరణలో వేగం పెంచాలి

- నిర్దిష్ట ప్రణాళికతో అధికారులు అడుగులు వేయాలి
- కలెక్టరేట్‌లో అధికారుల సమీక్ష
- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూన్ 13 : సాగునీటి ప్రాజెక్టు కోసం నిర్ధిష్ట ప్రణాళికతో భూ సేకరణలో వేగం పెంచాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో భూ సేకరణ, ప్రతివారం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న కేఎల్ఐ, పాలమూరు-రంగారెడ్డి, మార్కేండేయ, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు తదితర నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూసేందుకు ఈ భూసేకరణ కీలకమన్నారు. జిల్లాలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యంత వేగవంతంగా భూ సేకరణ చేపట్టాలన్నారు. ఈ మేరకు ప్రాజెక్టుల వారిగా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయో గుర్తించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకునేలా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భూమి కొలతలు, పరిహారం పంపిణీ, భూ స్వాముల సమ్మతి వంటి ప్రక్రియలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వచ్చేవారం సమీక్ష నాటికి మరింత పురోగతి సాధించాలనే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో, బాధ్యతతో, సమయ పాలనతో పనిచేయాలన్నారు. ప్రతి ప్రాజెక్టులో నిశ్చితమైన పురోగతిని సాధించేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖాధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్, రెవెన్యూ, వివిధ ప్రాజెక్టుల నీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

**బాల కార్మికులను పనుల్లో పెట్టుకుంటే జైలుశిక్షే**

నాగర్‌కర్నూల్, జూన్ 13 : బాల కార్మికులను పనుల్లో పెట్టుకుంటే జైలుశిక్షేనని, ఆపరేషన్ ముస్కాన్, స్మైల్‌తో తనిఖీలు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులకు సూచించారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కార్మికశాఖ, జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలకార్మిక వ్యతిరేక దినోత్సవ పోస్టర్‌ను శుక్రవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాలకార్మికుల పనుల్లో పెట్టుకుంటే సమాచారం ఇచ్చేందుకు 1098, 112 నెంబర్లకు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. చట్టవిరుద్ధంగా బాలకార్మికులను వినియోగిస్తే జైలుశిక్ష తప్పదని కలెక్టర్ హెచ్చరించారు. ఎక్కడైనా బడీడు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, బడీడు పిల్లలందరూ బడుల్లోనే ఉండాలన్నారు. జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలనే సంకల్పంతో ఎక్కడా బాలకార్మికులు ఉండకూడదని, హోటళ్లు, వ్యాపార సంస్థలు, వ్యవసాయ పొలాలు, గృహాల్లో బాలురు పనిచేస్తూ కనిపిస్తే స్పెషల్ ఆపరేషన్ల ద్వారా గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూళనకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి రాజేశ్వరి, జిల్లా లేబర్ ఆఫీసర్ రాజ్‌కుమార్, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ చైర్మన్ లక్ష్మణ్ రావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి శ్రీశైలంగౌడ్, సఖి కోఆర్డినేటర్ సునీత, కోఆర్డినేటర్ శ్వేత పాల్గొన్నారు.

**లక్షా71వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు**

నాగర్‌కర్నూల్, జూన్ 13 : జిల్లాలో చారిత్రాత్మక ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 28,705 మంది రైతుల నుంచి లక్షా 71 వేల 694 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు కలెక్టర్ సంతోష్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో మాట్లాడుతూ.. జిల్లాలో 232 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి 142 మిల్లులకు తరలించినట్లు తెలిపారు. జిల్లాలో లక్షా60వేల ఎకరాల్లో వరి పంట సాగు జరిగిందని, వ్యవసాయాధికారుల అంచనా ప్రకారం 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, రైతుల అవసరాలకు, విత్తనాల వినియోగానికి అవసరమైన మేరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందన్నారు. ఇంకా 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు 26, 314 మంది రైతుల ఖాతాల్లో 335 కోట్ల ధాన్యం డబ్బులను జమ చేయడం జరిగిందన్నారు. ఇంకా 239మంది రైతులకు రూ. 60 కోట్లు త్వరలోనే వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

## పోలీసులు ఆరోగ్యవంతమైన జీవితం గడపాలి

- హెల్త్ క్యాంప్‌లో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, జూన్ 13: పోలీసు కుటుంబాలు ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీస్ కుటుంబాలకు ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వైద్యులైన జనరల్ ఫిజీషియన్ పూర్ణిమ, గైనకాలజిస్ట్ దివ్య, పీడియాట్రీషియన్ నరేన్, ఆర్థోపెడిక్ రాజులు దాదాపు 300 మంది పోలీస్ కుటుంబాలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త నమూనాలు సేకరించి అన్ని రకాలా వైద్యపరీక్షలు చేశారు.

కార్యక్రమంలో అదనపుఎస్పీ రామేశ్వర్, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యను బలోపేతం చేయడమే లక్ష్యం



చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

బల్మూరు, జూన్ 13: ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గుడ్డు బిర్యానీ పథకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన గర్భిణులు, చిన్నారులతో కలిసి భోజనం చేశారు. అంతకుముందు విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో రాజేశ్వరి, సీడీపీవో దమయంతి, సూపర్ వైజర్లు, నాయకులు వెంకట్‌రెడ్డి, కాశన్నయాదవ్, రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

## వృథాగా 'భగీరథ' నీరు.. పట్టించుకోని అధికారులు



సాయిగుట్టతండా వద్ద లీకేజీ పైపులైన్

వంగూరు, జూన్ 13 : మండలంలోని తిరుమలగిరి గ్రామ పంచాయతీలోని సాయిగుట్టతండాలో మిషన్ భగీరథ నీరులీకేజీ ఏర్పడి నీరు వృథాగా పారుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని తండా వాసులు వాపోతున్నారు. గత నెలరోజుల నుంచి సాయిగుట్ట తండాకు తాగునీరు అందించే భగీరథ పైప్‌లైన్ జంక్షన్ వద్ద చిన్న లీకేజీ ఏర్పడి రానురాను పెద్దదిగా మారి నీరు వృథాగా పారుతుంది. దీంతో తండాలో మంచి నీరు రాక వారు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులకు ఎన్నిమార్లు మొరపెట్టుకున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని శుక్రవారం తండావాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీకి మరమ్మతులు చేసి తండాకు నీరందించాలని వారు కోరుతున్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- కల్వకుర్తి ఆర్డీవో శ్రీను

కల్వకుర్తి రూరల్, జూన్ 13 : గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కల్వకుర్తి ఆర్డీవో శ్రీను అన్నారు. శుక్రవారం మండలంలోని తర్నికల్ పంచాయితీ కార్యాలయంలో, కల్వకుర్తి పట్టణంలోని రైతువేదికలో తాసీల్దార్ ఇబ్రహీం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సదస్సులను ఆర్డీవో సందర్శించారు. కార్యక్రమంలో డీటీ అనిత, రాఘువేందర్, ఆర్ఐలు ఉన్నారు.

**అచ్చంపేటలో..**

అచ్చంపేటటౌన్, జూన్ 13: భూ భారతి రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని రైతు వ్యవసాయమార్కెట్‌లో రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు.. మున్సిపల్ పరిధిలోని భూ సమస్యలను ఫిర్యాదులను దరఖాస్తు చేసుకొని అధికారుల ద్వారా క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి సమస్యలను పరిష్కరిస్తారని అన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

**కొనసాగుతున్న సదస్సులు**

తిమ్మాజిపేట, జూన్ 13 : మండలంలో సదస్సులు కొనసాగుతున్నాయి. శుక్రవారం మారేపల్లి, బావాజీపల్లిలో సదస్సులను నిర్వహించారు. 20ఫిర్యాదులు వచ్చినట్లు తాసీల్దార్ రామకృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో డీటీ జ్యోతి పాల్గొన్నారు.

**బల్మూర్‌లో..**

బల్మూరు, జూన్ 13: భూ సమస్యల పరిష్కారానికే కోసమే సదస్సులను నిర్వహిస్తుందని తాసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం బల్మూరు, గోదల్ గ్రామాల్లో అధికారులు సదస్సులను నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ కేశవ్, గిర్దావరులు శివ, పద్మ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

**అన్నదాతలకు అవగాహన సదస్సు**

నాగర్‌కర్నూల్ రూరల్, జూన్ 13 : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న " రైతు ముంగిట శాస్త్రవేత్తలు-అవగాహన సదస్సు" ను మండలంలోని గగ్గలపల్లి రైతులకు, పాలెం వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో అన్నదాతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలెం వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డా.టిఅర్చన, గగ్గలపల్లి ఏఈవో నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ వినుత, బోధనా సి బ్బంది, కళాశాల మొదటి సంవత్సర విద్యార్థులు, గ్రామపెద్దలు, రైతులు, సిబ్బంది కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతుబంధు ఊసేది

- బీఆర్ఎస్ నాయకుల మండిపాటు

పెంట్లవెల్లి, జూన్ 13 : గత కొద్దిరోజులుగా కురుస్తున్న తొలకరి వర్షాలతో వ్యవసాయ భూములన్నీ తడిసి ముద్దయ్యాయి. రైతులకు పంట పెట్టుబడి సహాయం రైతుబంధు ఎప్పుడు వేస్తారని మండల బీఆర్ఎస్ నాయకులు రాజేశ్, సురేందర్‌గౌడ్, పోతుల వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మాయ మాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేసిందన్నారు. ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకున్న పర్వాలేదని, కనీసం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన రైతు బంధు వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు వ్యవసాయం చేసేందుకు వడ్డీ వ్యాపారులతో అప్పులు చేస్తున్నారని, అంతే కాక నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నాడు బీఆర్ఎస్ సబ్బండ వర్గాలకు పథకాలు అందిస్తే... నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాలకు పంగనామాలు పెడుతున్నదని విమర్శించారు. తక్కువ సమయంలో విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం ఏదన్న ఉందా... అంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ విజయరామారావు, ఎస్‌కే ఖాజా, జ్ఞానేశ్వర్, రాజు ఉన్నారు.

## ఉద్యాన కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం



మోజర్ల ఉద్యాన కళాశాల

పెద్దమందడి, జూన్ 13 : వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని మోజర్ల, కొల్లాపూర్‌లో ఉన్న కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాలలో చదివేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ సైదయ్య తెలిపారు. తెలంగాణ ఉద్యాన విశ్వవిదాయలయంలో రెండేండ్ల ఉద్యాన డిప్లొమా కోసం నోటిఫికేషన్ జారీ చేసిందని ఆయన చెప్పారు. మొత్తం 200 సీట్లు ఉంటే ఉద్యాన విశ్వవిద్యాలయం పాలిటెక్నిక్‌లు ఆదిలాబాద్, రామగిరికిల్లా, కొల్లాపూర్ ఉద్యాన కళాశాలల్లో 40చొప్పున ఇంటెక్ కెపాసిటీ ఉందని చెప్పారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఇప్పటికే అప్లికేషన్లు తీసుకుంటుందని, అప్లికేషన్లు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 28 చివరి తేదీ అని, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పాలిసెట్ 2025 లేదా పదో తరగతి పాసైన వాళ్లు, ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులు డిప్లొమాకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పాలిసెట్ 2025 ర్యాంకు లేదా సమానమైన పరీక్ష ద్వారా ప్రతిభ ఆధారంగా విద్యార్థులు అడ్మిషన్లు ఉంటాయని ఆయన తెలిపారు. డిసెంబర్ 31, 2025 నాటికి కనీసం 15 ఏండ్లు, గరిష్ఠంగా 22ఏండ్ల వయసు కలిగి ఉండాలని, 60శాతం సీట్లు గ్రామీణ ప్రాంతాల్లో కనీసం నాలుగేండ్లు చదివిన విద్యార్థులకు కేటాయిస్తారు.

**ఉపాధి అవకాశాలు మెండు**

ఉద్యాన డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు పుష్కలమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని కళాశాల అసోసియేట్ డీన్ సైదయ్య చెప్పారు. పంటల విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యం, ఉద్యాన ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో, భవిష్యత్తులో శిక్షణ పొందిన మానవ వనరులకు మేలైన ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. నర్సరీ మొదలుకొని చీడపీడల యాజమాన్యం, ఉద్యాన పంటల శాస్త్రీయ ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదలలో మెళకువలు అలాగే పంట కోత విలువల జోడింపు వంటి అంశాలపై విద్యార్థులకు డిప్లొమాలో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఉద్యాన పరిశ్రమలు, ఆయిల్ పాం పరిశ్రమలతోపాటు ఉద్యోగ అవకాశాలున్నాయని, నేరుగా బీఎస్సీ హార్టికల్చర్ డిగ్రీలో హార్టి సెట్ ద్వారా సీటు సంపాదించవచ్చున్నారు.

## గర్భిణులకు మెడికల్ కిట్లు పంపిణీ



మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వెల్దండ, జూన్ 13 : తల్లీ, బిడ్డ క్షేమంగా ఉండాలన్న ఉద్దేశంతో గర్భిణులకు ఉప్పల ట్రస్ట్ ద్వారా మెడికల్ కిట్లు అందజేస్తున్నట్లు బీఆర్ఎస్ మండల నాయకుడు చల్లా మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా గర్భిణులకు మెడికల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీఉప సర్పంచ్ నిరంజన్, బీఆర్ఎస్ మండల నాయకులు సిద్ధగోని రమేశ్‌గౌడ్, పూరిరమేశ్, దేవేందర్, రవికుమార్‌ఉన్నారు.

**కల్వకుర్తిలో..**

కల్వకుర్తి, జూన్ 13 : ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెడికల్ కిట్లను శుక్రవారం మండలంలోని సుద్దకల్ గ్రామంలో గర్భిణులకు బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ రాంరెడ్డి,కాశన్న, ఆంజనేయులు, చంద్రశేఖర్ ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

**విత్తన దుకాణాల తనిఖీ**

కొల్లాపూర్ రూరల్, జూన్ 13 :నియోజకవర్గ కేంద్రంలో విత్తన దుకాణాలను మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని అన్ని విత్తన దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలు రైతులకు విక్రయించాలని డీలర్లను ఆదేశించారు. సందర్భంగా డీలర్లకు పలు సూచనలు తెలిపారు.

**యాంత్రీకరణతో పంటలను సాగు చేయాలి**

బిజినేపల్లి, జూన్ 13 : రైతులు యాంత్రీకరణతో పంటలను సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్తలు నళిని, కల్యాణి అన్నారు. శుక్రవారం మండలంలో ఎర్రకుంట, ఊడ్గులకుంట తండాల్లో పాలెం వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో ఏవో నీతి, వంశీనాయక్, భారతి ఉన్నారు.

**ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థులు ఎంపిక**

కల్వకుర్తి, జూన్ 13 : యూత్‌ఫర్ సేవా సహకారంతో కల్వకుర్తి ప్రాంతానికి చెందిన 6మంది విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ జాతీయ ప్రతిభ నిధి పరీక్షకు ఎంపికయ్యారు. గ్రామీణ విద్యను అభివృద్ధి చేయడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ పరీక్షను నిర్వహిస్తుంది. ఈ సంవత్సరం కల్వకుర్తి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు.

**17న రజకుల మహాధర్నా..**

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య

నాగర్ కర్నూల్ రూరల్, జూన్ 13 : జూన్17న నిర్వహించు రజక వృత్తిదారుల చలో హైదరాబాద్ కార్యక్రమం, మహాధర్నా కరపత్ర ఆవిష్కరణను జిల్లా రైతుసంఘం కార్యాలయం జిల్లా అధ్యక్షుడు పెద్దాపురం శాలేశ్వర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ..రజక, నాయీబ్రాహ్మణ వృత్తిదారుల ఉచిత విద్యుత్తు పథకం పెండింగ్ బిల్లులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. విద్యుత్ అధికారుల వేధింపులు ఆపాలని,అధిక బిల్లులు రద్దు చేయాలని, వీటన్నిటికోసం జూన్ 17న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శాలేశ్వర్, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, పట్టణాధ్యక్షుడు నిరంజన్ పాల్గొన్నారు.

**అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి**

నాగర్ కర్నూల్ రూరల్, జూన్ 13: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం బస్టాండ్ సమీపంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రాజేశ్ రెడ్డి, తమ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఇండ్లు ఇస్తున్నారని, అర్హులందరికీ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పల్లెరాజు, గుంపల్లి ఆంజనేయులు, నాగరాజు పాల్గొన్నారు.


**తాసీల్దార్‌ను కలిసిన కవి**

పెద్దకొత్తపల్లి, జూన్ 13 : మండల తాసీల్దార్ శ్రీనివాసులను శుక్రవారం ప్రముఖ కవి రచయిత కాశన్న మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాను ఇటీవల రాసిన పుస్తకాలను అందజేశారు.

**గాంధీ విగ్రహాన్ని యథాస్థానంలో ఉంచాలి**

పెద్దకొత్తపల్లి, జూన్ 13 : ఈ నెల 9వ తేదీన అర్ధరాత్రి మండల కేంద్రంలోని గాంధీ విగ్రహాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరులు తొలగించారని వెంటనే యథాస్థానంలో ఏర్పాటు చేయాలని మండలంలోని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. 60ఏండ్ల క్రితం ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఎందుకు తొలగించారని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో భీమేశ్, నాగరాజు, కాశి రెడ్డి, కిషోర్, రాజశేఖర్, శ్యామ్‌సుందర్, శ్రీనివాసులు, ప్రేమ్ కుమార్, పరుశురామ్, మల్లేష్, భాస్కర్, శేఖర్ ఉన్నారు.

## లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి రమాకాంత్

- జిల్లా జడ్జి రమాకాంత్

నాగర్‌కర్నూల్, జూన్ 13 : ఈనెల 14న జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లాజడ్జి రమాకాంత్ కోరారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజీ అయ్యే క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, పెట్టి కేసులు, డ్రంకెన్ డ్రైవ్ కేసులు, ఎక్సైజ్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు సాధ్యమైనంత వరకు ఇరుపక్షాలతో రాజీ కుదిరి కేసులు పరిష్కారం చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు సెటిల్ అయితే ఇరుపక్షాలు సుఖసంతోషాలతో జీవిస్తాయన్నారు. అప్పీలులేని తీర్పును పొంది సమయాభావం, ఖర్చు ఆదా అవుతుందన్నారు. భూములకు సంబంధించిన సివిల్ కేసులు పరిష్కరించుకోగలరని సూచించారు. సివిల్ కేసుల్లో కోర్టు ఫీజు వాపస్ ఇవ్వడుతుందన్నారు. సమావేశంలో డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి నసీం సుల్తానా ఉన్నారు.

## అనుమతి లేకుండా రిజర్వాయర్ చేపట్టొద్దు

బల్మూరు, జూన్ 13: రైతుల అనుమతులు లేకుండా ఉమామహేశ్వర ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టొద్దని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాములు అన్నారు. శుక్రవారం మండలంలోని అనంతవరం, బల్మూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. భూములు కోల్పోయిన రైతులతో సమావేశం నిర్వహించారు. రిజర్వాయర్ నిర్మాణం చేస్తే అనంతవరం, బల్మూరు, అంబగిరి, మైలారం చెందిన రైతులు 2,600 ఎకరాల భూములను రైతులు కోల్పోవడం జరుగుతుందన్నారు. అనంతవరం రైతులు మాట్లాడుతూ.. రిజర్వాయర్ పాత నమూనా సర్వేనెంబర్ 20, 21, 22లో ఆయకట్టు వేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శంకర్‌నాయక్, నాగరాజు, శివకుమార్, భూ రైతులు కృష్ణయ్య, రాజేశ్, అంతయ్య, స్వామి, శ్రీను, బంగారయ్య, మల్లమ్మ ఉన్నారు.

**బ్యాగుల పంపిణీ**

బల్మూరు, జూన్ 13: మండలంలోని గోదల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బీజేపీ నాయకులు రమణగౌడ్ విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు దాదాపు రూ.30వేలతో బ్యాగులు, పెన్నులు, బలుపాలు, తదితర వస్తులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై రాజేందర్, గ్రామస్తులు శివాజీ, ప్రతాప్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్ ఉన్నారు.



బ్యాగులు పంపిణీ చేస్తున్న రమణగౌడ్, ఎస్సై రాజేందర్

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ

కొల్లాపూర్ రూరల్, జూన్ 13 : మండలంలోని ఎల్లూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలకు హాజరు కావాలని శ్రద్ధగా చదివి సంఘంలో మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రఘువర్ధన్ రెడ్డి, మునీశ్వర్, శ్రీకాంత్, శ్రీధర్, శీనయ్య , చక్రధర్ రెడ్డి, రాము, కృష్ణకుమారి విద్యార్థులు పాల్గొన్నారు.

**వెల్దండలో..**

వెల్దండ, జూన్ 13 : మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు అన్నివిధాలా కృషి చేస్తామన్నారు. విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



డిండిచింతపల్లిలో పుస్తకాలు అందజేస్తున్న ఎంపీడీవో

**దుస్తుల పంపిణీ**

వంగూరు, జూన్ 13 : బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని డిండిచింతపల్లి, ఉప్పల్‌పహాడ్ ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలను ఎంపీడీవో బ్రహ్మచారి అందజేశారు. ఉప్పల్‌పహాడ్ పాఠశాలలో అక్షరభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో మురళీమోహనాచారి, మాజీసర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, హెచ్ఎంలు చిన్నయ్య, సురేందర్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## ప్రభుత్వ దవాఖానలో సమస్యలు పరిష్కరించాలి

అచ్చంపేట, జూన్ 13: ప్రభుత్వ దవాఖానలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ దవాఖాన ఆర్ఎంవో ప్రదీప్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు పెర్ముల గోపాల్, మల్లేశ్ మాట్లాడుతూ దవాఖానలో సరిపోను డాక్టర్లు, సిబ్బంది లేరని, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందడం లేదన్నారు. అయిదుగురు డాక్టర్లు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారని, సరిపోను డాక్టర్లు, సిబ్బంది నియమించాలని కోరారు. వైద్యం పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. కార్యక్రమంలో తిర్పతమ్మ, భాస్కర్ పాల్గొన్నారు.

**పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి**

వంగూరు, జూన్ 13 : ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షానికి తోడు పిడుగుపాటు సంభవించడంతో మండలంలోని మిట్టసదగోడు గ్రామంలో ఎద్దు, ఆవు మృతి చెందాయి. మిట్టసదగోడు గ్రామానికి చెందిన మహేశ్ అనే రైతు శుక్రవారం తమ పొలంలో సాగు చేసిన పత్తి పంటకు గుంటుక కొడుతున్న సమయంలో వర్షం రావడంతో గుంటుక విడిచి ఎద్దు, ఆవును చెట్టుకు కట్టేసి తన తండ్రితో కలిసి మహేశ్ మరో చెట్టు కిందికి వెళ్లారు. ఇంతలోనే పిడుగుపడి చెట్టుకు కట్టేసిన మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.1.20 లక్షలుంటుందని రైతు వాపోయాడు.

## ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



మమ్మాయిపల్లిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

నాగర్‌కర్నూల్, జూన్ 13 : ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా 8వరోజు జిల్లా వ్యాప్తంగా ఉన్న 560 ప్రాథమిక పాఠశాలలు, 125 ప్రాథమికోన్నత పాఠశాలల్లో నూతనంగా 1వ తరగతిలో నమోదైన దాదాపు 4 వేల మంది చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని విజయవంతం నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాగతం పలికి అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డీఈవో రమేశ్‌కుమార్ తెలిపారు.

**సామూహిక అక్షరభ్యాసం**

బిజినేపల్లి, జూన్ 13 : మండలంలోని మమ్మాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం బాలకృష్ణారెడ్డి, హెచ్ఎంలు వకుళ, శ్రీనివాసులు శర్మ ఉపాధ్యాయులు బాలసాగర్, ప్రియదర్శిని, కాంప్లెక్స్ సీఆర్‌పీ రామస్వామి, అంగన్‌వాడీ టీచర్ పుష్పలత, మాజీ సర్పంచ్ నాగమణి తదితరులు పాల్గొన్నారు. కాగా బడి బయటి పిల్లల్ని బడిలో చేర్పించాలని ఎంపీడీవో కతలప్ప అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ, దివ్య, మాధవి ఉన్నారు.

**కల్వకుర్తిలో..**

కల్వకుర్తి రూరల్, జూన్ 13 : సర్కారు బడుల్లో మెరుగైన విద్యను అందిస్తున్నారని ఎల్లికల్ పాఠశాల హెచ్ఎం జమీల్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం ఎల్లికల్‌లో బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

**లింగాలలో..**

లింగాల, జూన్ 13: మండలంలోని వల్లభాపూర్ అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం నిర్వభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరమేశ్వర్ పాల్గొన్నారు.

**తిమ్మాజిపేటలో..**

తిమ్మాజిపేట, జూన్ 13 : మండలంలోని ఆవంచ గ్రామంలోని అంగన్‌వాడీల్లో అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాలమణి జీహెచ్ఎం అమృత, హెచ్ఎం ప్రశాంత్ పాల్గొన్నారు.

**ఉప్పునుంతలలో**

ఉప్పునుంతల, జూన్13: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం జయశంకర్ బడిబాటలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం చేపట్టారు. కంసానిపల్లి ఎంఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రాములునాయక్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**BUILDING CONSTRUCTION**

★ Mahabubnagar పాత జిల్లాలో ఇండివిజువల్ ఇల్లు, హాస్పిటల్ బిల్డింగ్, కమర్షియల్ బిల్డింగ్ కట్టుకోవాలనుకునే వారికి మేము పూర్తిగా 100% క్వాలిటీతో మీ కలలను సాకారపరుస్తు అద్భుతంగా నిర్మించి ఇవ్వగలం. **Brick & Bond Home Constructions. Contact Cell Nos : 7013510429, 9160069191.**

NT-MBNR

**FLAT FOR SALE**

★ Mahabubnagar టౌన్లో కొత్తగా నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో 2BHK మరియు 3BHK Flats అమ్మకానికి కలవు. Ready to occupy, 90% హౌసింగ్ లోన్ ఫెసిలిటి, False Celling, లిఫ్ట్, జనరేటర్ మరియు 24 గంటలు CC కెమరా సౌకర్యం కలదు. SS Constructions. **Contact Cell Nos : 7013510429, 9441382770.**

NT-MBNR

**ప్రకటన**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748